# అధ్యాయము 18

# అబ్రాహామును దేవుడు సందర్శించుట

ముందు అధ్యాయములో, యెహోవా అబ్రాహామునకు ప్రత్యక్షమాయెను. ఈ శుభ సందర్భమైన సభలో, దేవుడు కనాను దేశమును వాగ్దాన భూమిగా గుర్తించెను (17:8), సున్నతి అను ఒడంబడికను గూర్చి వివరించెను (17:9–14), మరియు అబ్రాహాము మరియు శారా యొక్క పేర్లను మార్చెను (17:5, 15). భవిష్యద్ జనములకు తల్లియైన శారా, ఇస్సాకు అను పేరుగల కుమారుని కనును అని ఆయన చెప్పెను (17:16, 19); మరియు పన్నెండు మంది రాజులకు తండ్రిగాను మరియు గొప్పజనమునకు మూలపురుషునిగా ఇష్మాయేలును చేసెదనని ఆయన వాగ్దానము చేసెను (17:20). దీని తరువాత, వెంటనే కనుమరుగైపోయెను (17:22). 18వ అధ్యాయములో, దేవుడు అబ్రాహామును మరలా దర్శించెను.

## ముగ్గురు పరలోక సందర్శకులకు అబ్రాహాము యొక్క అతిథి సత్కారము (18:1–8)

**1మరియు మమ్రేదగ్గరనున్న సింధూరవనములో అబ్రాహాము ఎండవేళ గుడారపు ద్వారమందు కూర్చునియున్నప్పుడు యెహోవా అతనికి కనబడెను.**
**2అతడు కన్నులెత్తి చూచినప్పుడు ముగ్గురు మనుష్యులు అతని యెదుట నిలువబడి యుండిరి. అతడు వారిని చూచి గుడారపు వాకిటనుండి వారిని ఎదుర్కొనుటకు పరుగెత్తి నేల మట్టుకు వంగి. 3ప్రభువా, నీ కటాక్షము నామీద నున్నయెడల ఇప్పుడు నీ దాసుని దాటిపోవద్దు. 4నేను కొంచెము నీళ్లు తెప్పించెదను; దయచేసి కాళ్లు కడుగుకొని యీ చెట్టుక్రింద అలసట తీర్చుకొనుడి.**
**5కొంచెము ఆహారము తెచ్చెదను; మీ ప్రాణములను బలపరచుకొనుడి; తరువాత మీరు వెళ్లవచ్చును; ఇందు నిమిత్తముగదా మీ దాసునియొద్దకు వచ్చితిరనెను.**

**వారు–నీవు చెప్పినట్లు చేయమనగా. [6]అబ్రాహాము గుడారములోనున్న శారాయొద్దకు త్వరగా వెళ్లి–నీవు త్వరపడి మూడు మానికల మెత్తనిపిండి తెచ్చి పిసికి రొట్టెలు చేయమని చెప్పెను. [7]మరియు అబ్రాహాము పశువుల మందకు పరుగెత్తి ఒక మంచి లేత దూడను తెచ్చి ఒక పనివాని కప్పగించెను. వాడు దాని త్వరగా సిద్ధపరచెను. [8]తరువాత అతడు వెన్నను పాలను తాను సిద్ధము చేయించిన దూడను తెచ్చి వారియెదుటపెట్టి వారు భోజనము చేయుచుండగా వారియొద్ద ఆ చెట్టుక్రింద నిలుచుండెను.**

**వచనము 1**. ఇది **ప్రభువు** (יהוה, *YHWH*), లేదా మరలా వచ్చిన "యెహోవా." ఈ సారి, ఆయన మనుష్యులుగా కనిపించిన ముగ్గురు పరలోక సందర్శకులలో ఒకనిగా కలసి వచ్చెను. ఖచ్చితముగా, కథ చివరి వరకు సముహాములో మాట్లాడినవాని యొక్క గుర్తింపును అబ్రాహాము కనుగొనలేకపోయెను (18:10, 13, 14, 17, 20, 25–27, 30, 32, 33).

వృద్ధుడైన పితరుడు [తన] **గుడారపు ద్వారము యొద్ద కూర్చునియుండెను**. అస్థిర గుడారములకు పగటి పూట పైకెత్తుకునే వాటిలోనుండి చల్లని గాలి లోపలికి ప్రవేశింపజేయు రెక్కలు కలిగి యున్నవి. ఆ గుడారపు ద్వారమునొద్ద కూర్చొనుట వలన అబ్రాహాముకు దాని నీడను అదేవిధముగా చల్లని గాలిని అనుభవించుటకు సాధ్యమైంది.[1] అదనముగా, అతని గుడారము మమ్రేదగ్గరనున్న సింధూరవనమునొద్ద స్థాపించబడి యుండవచ్చు (13:18; 14:13). వేడిమిగల మధ్యహ్నపువేళ సూర్య కాంతి నుండి ఉపసమనము కొరకు, అక్కడ అతడు విశ్రాంతి తీసుకొను చుండవచ్చు.

**వచనము 2**. వెంటనే, అబ్రాహాము తన కన్నులను పైకెత్తి ముగ్గురు మనుష్యులు ... ఎదురుగా నిలిచుండుట చూచెను. అతను వారిని చూచిన వెంటనే, వారిని అభినందించుటకు అతను గుడారములోనుండి త్వరపడి పరుగెత్తి మరియు తాను భూమిమట్టుకు సాష్టాంగపడెను. ఇక్కడ "సాష్టంగపడెను" חָוָה (*chawah*), అను దానికి ఉపయోగించిన హెబ్రీ పదము, సాధారణముగా పాతనిబంధనలో దేవుని ఆరాధనను (లేదా విగ్రహముల) సూచిస్తుంది (24:26; నిర్గమ 20:5). అయితే, కొన్ని సందర్భాలలో, ఈ సందర్భములో అబ్రాహాము వలెనె, అది "అమిత శక్తిపాతము," అనగా "బంధువుల, అపరిచితుల, అధికారుల మరియు ముఖ్యముగా రాజ కుటుంబసభ్యుల ముందు స్వీయ అవమానమునకు ప్రదర్శించు ఒక సాధారణ చట్టము."[2] ముగ్గురు సందర్శకులు పరలోకపు మనుష్యులు అను సత్యము తెలియకుండానే ఆ అపరిచితులను మంచిగా స్వాగతించుట ద్వారా అబ్రాహాము ఒక అతిథ్యునిగా విభేదాలు లేకుండా వారిని అత్యధికముగా గౌరవించెను.

**వచనము 3**. తూర్పు ఈశాన్య ప్రజలకు ముఖ్యముగా సమాజము యొక్క

అంచులలో నివసించే ప్రజలకు మరియు సందర్శించడానికి లేదా అతిథులకు వినోధమును కల్పించడానికి తక్కువ అవకాశం ఉన్నవారికి ఆతిథ్యము ఇచ్చుటకు అబ్రాహాము యొక్క చర్య ఒక ఉదాహరణ. అంతేకాక, ఆ సంస్కృతిలో, అతిథులు వారితో ఉన్నంతవరకు వారి యొక్క అవసరతలు తీర్చి భద్రతను అందించే బాధ్యత ఆతిథ్యునిపై ఉన్నది. అందువలన, పితరులు నాయకుని **నా ప్రభువా**, అని సంబోధించేవారు, అది ఈ కాలములో, మర్యాదతో కూడిన "సర్"[3] అను పదమును పోలిన నమస్కారము. **నీ కటాక్షము నామీద నున్నయెడల ఇప్పుడు నీ దాసుని దాటిపోవద్దు** అని చెప్తూ అతను ఆయనను వేడుకొనెను.

**వచనములు 4, 5**. అప్పుడు అతను వారికి ఎండలో, అలసిపోయిన ప్రయాణికులు ఎప్పుడూ ఎంచుకొనేవాటిని ఇవ్వడం కొనసాగించాడు: త్రాగుటకు మరియు [వారి] **పాదములు కడుగుకొనుటకు నీళ్లు** (19:2; 24:32; 43:24; న్యాయాధి. 19:21; లూకా 7:44 చూడండి). అతను **రొట్టె ముక్కను** ("రొట్టె ముద్ద"; NKJV) తెచ్చుటకు వెళ్లినప్పుడు, అతను చెట్టు నీడలో విశ్రాంతి తీసుకొనమని వారిని ఆహ్వానించెను (18:1 చూడండి). అబ్రాహాము తన అతిథుల కొరకు మనస్సులో కలిగియున్న ఒక విధమైన విందును అర్థంచేసుకునే విధానము ఇదే. అతిథులను నెమ్మదిగా ఉంచుటకు మరియు వారు తన మీద గంభీరముగా లేరని హామీ ఇచ్చుటకు ఇది ఉద్దేశించబడినది. లేకపోతే, వారు తన ఆహ్వానాన్ని తిరస్కరించియుండేవారు. సందర్శకులు దీనిని వినినప్పుడు, **నీవు చెప్పినట్లు చేయుము** అని వారు ప్రత్యుత్తరమిచ్చారు.

**వచనము 6**. అబ్రాహాము వయస్సును మరియు ఎండవేళను లెక్కజేయకుండా, తన అతిథులకు స్వాగతమునిచ్చి వారికి అవసరమైనవన్నీ ఇవ్వాలనుకున్నాడు. **ఆయన గుడారములోని శారా యొద్దకు త్వరపడి వెళ్లి మూడు మానికల** ["సియాలు"; NIV] పిండిని తీసుకుని రొట్టెలు చేయమని చెప్పెను. ఒక seah సుమారు రెండు గ్యాలన్లు (లేదా ఎనిమిది లీటర్లు)[4] కావడంతో, మూడు seahల **పిండితో అబ్రాహాము**, శారా మరియు ముగ్గురు సందర్శకులు తినగలిగిన దానికంటే ఎక్కువ మొత్తములో రొట్టెను చేయవచ్చు. ఈ కథలో ఇంకెవరినీ పేర్కొననప్పటికినీ అబ్రాహాముకు పెద్ద కుటుంబము ఉన్నదని గుర్తుంచుకోవాలి (14:14). ఎవరూ ఈ మనుష్యులతో తిననప్పటికినీ, భోజనము వృథా అయ్యియుండదు. "గోధుమపిండి ఎక్కువ నాణ్యత గలిగిన పిండిని సూచిస్తుంది; అది మెత్తగా చేయబడి మరియు గోధుమ నుండి తయారుచేయబడినది. మిగిలిన చోట్ల, తక్కువ ఖర్చుతో కూడుకొనిన యవ్వలకు విరుద్ధముగా నిలుస్తుంది (2 రాజులు 7:1, 16). ధర్మశాస్త్రములో, "గోధుమపిండిని" తరచుగా బలియాగముల కొరకు దేవుడు కోరెను (నిర్గమ. 29:2, 40; లేవీ. 2:1–7; 5:11; 6:15, 20).

**వచనములు 7, 8**. ఒక గొర్రెపిల్లయో లేక ఒక మేకనో సరిపోయేది (2 సమూ.

12:4; లూకా 15:27–30 చూడండి), కాని మందనుండి **ఒక మంచి లేత దూడను** వధించడంలో ఈ ముగ్గురు అపరచితులకు చూపిన దాతృత్వము రాజులకు సరిపడినదిగా కనబడుతుంది. ఈ విందును సిద్ధపరుస్తుండగా, మరియు తన అతిథులకు తనకు కలిగిన దానిలో శ్రేష్ఠమైనదానిని ఇచ్చుటకు తీసుకున్న మరియెక్కువ కృషి ద్వారా, ఇతరులకు "ఆశీర్వాదకారముగానుందువు" అని చాలా సంవత్సరముల క్రితం దేవుడు ఈ పితరునికి యిచ్చిన ఆజ్ఞను బహుశా జ్ఞప్తికి తెచ్చుకున్నాడు (12:2). తన సేవకుడు ఈ మాంసమును సిద్ధపరచిన తరువాత, **అబ్రాహాము వెన్నను పాలను తాను సిద్ధము చేయించిన దూడను తీసికొని వారికి** పెట్టెను (ద్వితీ. 32:14; న్యాయాధి. 5:25; 6:18, 19 చూడండి). అప్పుడు ఆయన **వారు భోజనము చేయుచుండగా వారియొద్ద ఆ చెట్టుక్రింద నిలుచుండెను.**

## శారా, నమ్మశక్యము కాని యజమానురాలు (18:9–15)

**[9]వారతనితో నీ భార్యయైన శారా ఎక్కడనున్నదని అడుగగా అతడు–ఇదిగో గుడారములో నున్నదని చెప్పెను. [10]అందుకాయన –మీదటికి ఈ కాలముననీయొద్దకు నిశ్చయముగా మరల వచ్చెదను. అప్పుడు నీ భార్యయైన శారాకు ఒక కుమారుడు కలుగునని చెప్పెను. శారా ఆయన వెనుక నుండిన గుడారపు ద్వారమందు వినుచుండెను. [11]అబ్రాహామును శారాయును బహుకాలము గడిచిన వృద్ధులై యుండిరి. స్త్రీ ధర్మము శారాకు నిలిచి పోయెను గనుక [12]శారా–నేను బలము ఉడిగినదాననైన తరువాత నాకు సుఖము కలుగునా? నా యజమానుడు వృద్ధుడై యున్నాడు గదా అని తనలో నవ్వుకొనెను. [13]అంతట యెహోవా అబ్రాహాముతో–వృద్ధురాలనైన నేను నిశ్చయముగా ప్రసవించెదనా అని శారా నవ్వనేల? [14]యెహోవాకు అసాధ్యమైనది ఏదైననున్నదా? మీదటికి ఈ కాలమున నిర్ణయకాలమందు నీ యొద్దకు తిరిగి వచ్చెదను. అప్పుడు శారాకు కుమారుడు కలుగుననెను. [15]శారా భయపడి–నేను నవ్వలేదని చెప్పగా ఆయన–అవును నీవు నవ్వితివనెను.**

**వచనము 9.** సుస్పష్టంగా, ఈ సందర్శకులతో అబ్రాహాము కాని శారా కాని కలిసి భుజించలేదు. వారు తినుచుండగా పితరుడు వారికి ఆతిథ్య మిచ్చువానిగా మరియు వేచియుండువానిగా నిలుచున్నాడు. పితరుల ఆచారమును అనుసరించి, శారా కూడా దగ్గరగానే ఉండియుంటుంది కాని ఇక్కడ కనబడకుండా ఉంది; సాధారణంగా మగవారైన సందర్శకులతో స్త్రీలు కలిసేవారు కారు.[5] అప్పుడు ఆ పురుషులు **నీ భార్యయైన శారా ఎక్కడనున్నదని** అడుగగా, వారి ప్రశ్న ద్వారా అబ్రాహాము కొంచెం ఆశ్చర్యమునకు గురియై యుంటాడు. ఆమె పేరు ఈ అపరిచితులకు ఎలా తెలుసు? అబ్రాహాము శారాను వారికి పరిచయం చేసినట్లు ఈ

వాక్యభాగము మనకు సూచించుటలేదు. ఈ సంఘటనల పరంపర అసలు ఈ సందర్శకులు సాధారణ పురుషుల కంటే ఎక్కువ వారా అనేంత ఆశ్చర్యమునకు గురి చేసింది. శారా యొక్క ఆచూకీని గూర్చి, ఆయన "ఇదిగో గుడారములో నున్నదని" సంజ్ఞ చేస్తూ బదులిచ్చాడు.

**వచనము 10**. ఇక్కడ "యెహోవా" (Yahweh)గా 18:13లో గుర్తించబడిన ప్రధానమైన వక్త, అప్పుడు అన్నాడు: **మీదటికి ఈ కాలమున నీయొద్దకు నిశ్చయముగా మరల వచ్చెదను. అప్పుడు నీ భార్యయైన శారాకు ఒక కుమారుడు కలుగునని చెప్పెను.** ఈ సమయమునకు ముందు కుమారుని గూర్చి దేవుడు అబ్రాహామునకు ఇచ్చిన వాగ్దానము కాలపరిమితి లేనిదిగా ఉంది, అంటే ఈ వాగ్దాన పుత్రుడు ఎప్పుడు వస్తాడో అని ఒక కాలము ఏమి ఇవ్వబడలేదు. ఆ ప్రత్యక్షతలకు విరుద్ధంగా, ఈ సందర్భంగా దేవుని ప్రకటన విశిష్టంగా ఉంది: "మీదటికి ఈ కాలమున" (כָּעֵת חַיָּה, *ka'eth chayyah*). 2 రాజులు 4:16, 17లో కూడా కనబడే ఈ పదసమూహము వసంత ఋతువును, అంటే "ఉజ్జీవింపబడే ఋతువును"[6] సూచిస్తుంది. యెహోవా పితరుని యొద్దకు తిరిగి రావడానికి మరియు శారా ఇస్సాకును ఒక సంవత్సరములో గర్భమందు ధరించడానికి గల సంబంధము ఈ ప్రవచనము మనకు తెలుపుట లేదుగాని, ఆమెకు కుమారుడు కలుగులాగున యెహోవా చేసెను అని 21:1 చెప్తుంది.

**గుడారపు ద్వారము యొద్ద నుండి వింటున్నశారా** రాబోయే సంవత్సరము వసంత ఋతువు నాటికి తాను ఒక కుమారునికి జన్మనిస్తుంది అని చేసిన ప్రవచన వాక్యమును అకస్మాత్తుగా విన్నది. స్పష్టంగా, ఈ దైవికమైన వక్త తన వెనుక భాగమును గుడారమునకు ఉంచాడు, కాబట్టి ఈ పురుషుల మధ్య సాగుతున్న రహస్య సంభాషణను ఎవరైనా దొంగచాటుగా వింటారేమోనని ఆయన ఆలోచించలేదు.

**వచనము 11**. ఇక్కడ కథకుడు పాఠకునికి **అబ్రాహాము మరియు శారా వయసులో పెద్దవారైనందున** బిడ్డను కనడం ఎంతటి కష్టమో (17:17 చూడండి) గుర్తుచేయుటకు ఈ వాక్యాన్ని సంభాషణ మధ్యలో ప్రస్తావించాడు. స్త్రీ ధర్మము శారాకు నిలిచిపోయెను; అంటే, ఆమె తన ఋతువిరతిని దాటింది.

**వచనము 12**. ఈ కారణము చేత, **అవిశ్వాసములో శారా తనలో నవ్వుకొనెను.** ఏమైనను, వారు తల్లిదండ్రులు కాబోతున్నారని వినినప్పుడు ఆ మాట విని సాగిలపడి నవ్విన (17:17) తన భర్త యొక్క సంశయముతో పోలిస్తే శారా యొక్క సంశయవాదము పెద్ద ఎక్కువేమి కాదు. శారా తనలో గొనుగుకుంటూ, **నేను బలము ఉడిగినదాననైన తరువాత నాకు సుఖము కలుగునా? నా యజమానుడు వృద్ధుడై యున్నాడు గదా అని తనలో నవ్వుకొనెను.** అబ్రాహాము జవాబు కంటే కూడా శారా యొక్క జవాబు చాలా కాపట్యముగా ఉంది, కాని బిడ్డలను కనుటకు వారు చాలా "వృద్ధులు" అని ఆమె గ్రహించింది.

చేదు అనుభవాలు అనుభవించిన ఎన్నో సంవత్సరముల గడచిన తరువాత అట్టి ఒక “సుఖము”ను ఆనందించాలనే ఆలోచనను కలిగియుండటానికి ఆమె ఎలా అనుమతించగలదు?

**వచనము 13.** ఆ అపరిచితమైన సందర్శకుడు అబ్రాహాముతో మాట్లాడుట శారా రహస్యంగా విన్నది, కాని తనలో తాను నవ్వుకొనుట ఆ వ్యక్తి విన్నప్పుడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. ఇక్కడ రచయిత **యెహోవాను** (దేవుని) మాట్లాడేవానిగా గుర్తించాడు, మరియు శారా పేరు ఆయనకు ఎలా తెలుసునో తనలో తాను నవ్వుకొనుట ఆయనకు ఎలా తెలుసునో అనే విషయంను ఈ గ్రహింపు వివరిస్తుంది; తన వయసులో ఒక **కుమారునికి జన్మనివ్వడమును** గూర్చి విన్నప్పుడు అవిశ్వాసంతో నవ్వుకొంది. కాబట్టి, దేవుడు అబ్రాహామును ప్రశ్నిస్తూ **... శారా నవ్వనేల? అని అన్నాడు.**

**వచనము 14.** దేవుడు ఈ ప్రశ్నను ఇంకొక ప్రశ్నతో కొనసాగించాడు—ఎన్నో సంవత్సరములుగా పితరుడు మరియు ఆయన భార్య ఎదుర్కొన్న ఒక ప్రధానమైన విషయాన్ని ఈ ప్రశ్న గుర్తించింది (15:1—18:15): **యెహోవాకు అసాధ్యమైనది ఏదైననున్నదా?** ఇది “లేదు” అనే సమాధానాన్ని ఎదురుచూసే ఒక పదచాతుర్యమైన ప్రశ్నే! యెహోవాకు ఏదియు అసాధ్యమైనది కాదు (యిర్మీయా 32:17; మత్తయి 19:26; లూకా 1:37). దేవుడు ఆయనను “సర్వశక్తిగల” దేవునిగా అప్పటికే బయలుపరచుకున్నాడు (17:1). వారి పెద్ద వయస్సులలో కూడా ఆశ్చర్యకరంగా వారిలోని సారమును ఉత్తేజపరచి ఒక బిడ్డను కనులాగున దేవుడు చేయగలడని అబ్రాహాము మరియు శారా నమ్మవలసినదిగా వారిని దేవుడు పిలిచాడు. ముందు ప్రకటించిన మాటను దేవుడు పునరుద్ఘాటించాడు: **మీదటికి ఈ కాలమున [ఉత్తేజపరచే కాలము, వసంతము] ... నీ యొద్దకు తిరిగి వచ్చెదను. అప్పుడు శారాకు కుమారుడు కలుగుననెను.**

**వచనము 15.** ఈ సందర్శకుడు నిజముగా మనిషి రూపములో ఉన్న దేవుడు అని **శారా** గ్రహించింది, లేకపోతే ఆమె అనుకున్న దానిని ఎవరు తెలుసుకోగలరు? ఆశ్చర్యపడుటకు తోడు, రహస్యముగా ఆమె చేసిన అవిశ్వాసపు ఆలోచనలను బయలుపరచుట వలన ఆమె **భయపడి** కొంచెం యిబ్బంది పడింది. కాబట్టి, ఆమె **నేను నవ్వలేదని** చెప్పి ఆ విషయాన్ని **నిరాకరించింది**. ఆమె గొణిగిన ఈ అసత్యము తన భర్త ప్రాణమునకు భయపడి ఫరో ముందు అబద్ధమాడిన సంఘటనతో (12:10—20) పోలినదిగా ఉంది. తన అవిశ్వాసమును దేవుడు తెలుసుకున్నాడని ఆమె గ్రహించినప్పుడు ఆయన నుండి ఒకవేళ వచ్చే శిక్షకు ఆమె భయపడింది; కాని ఆమె నవ్విందని ఆయన చెప్పుటద్వారా ఆమె అపరాధ భావనను ఆయన కొంచెం సమాధాన పరచాడు.

శారాకు దేవుడిచ్చిన జవాబు ఊహించనిది. ఆమె భయపడిన దైవిక ఉగ్రత యొక్క వ్యక్తము అందులో లేదు. అంతమాత్రమే కాదు 17:17లో కూడా తన భర్త

అవిశ్వాసము ఎట్టి దైవిక ఉగ్రతను తేలేదు. దీనికి విరుద్ధంగా, దరిదాపుగా మృతతుల్యమైన ఇద్దరి శరీరములు, ప్రత్యుత్పత్తికి సంబంధించినంత వరకు, ఒక బిడ్డకు జన్మమివ్వడానికి ఇంకా సాధ్యమే అనినమ్మడానికి వారికి చాలా కష్టమని దేవునికి తెలుసు. కాబట్టి, కఠినమైన తీర్పుభరిత జవాబుతో శారా హృదయంలోని కలవరాన్ని దేవుడు ఎక్కువ చేయలేదు. ఆయన ఆమెకు దృఢమైన మరియు కృపగల జవాబు ఇచ్చాడు: **అవును నీవు నవ్వితివనెను.**

అబ్రాహాము మరియు శారాల యొక్క అతిథులు వారికి ఒక శుభ సందేశాన్ని తెచ్చారు. వేచి చూసిన ఎన్నో సంవత్సరములు తరువాత, దేవుని వాగ్దానము నెరవేరడానికి వారికి ఒక సమయ క్రమము ఇవ్వబడింది; ఒక సంవత్సరములోగానే వారు ఒక కుమారుని పొందుకొంటారు. ఆ అతిథులు వెళ్లే ముందు, అబ్రాహామునకు ఒక దుర్వార్తను కూడా వారు ఇచ్చారు: తన సహోదరుని కుమారుడైన లోతు జీవిస్తున్న సొదొమ మరియు గొమొర్రా పట్టణములు చాలా చెడ్డవైనందున దైవిక ప్రతిచర్య రాబోతుందని వారు చెప్పారు.

## యెహోవా మరియు ఆ ఇద్దరు మనుషుల మధ్య గల సంభాషణ

## (18:16–22)

**16అప్పుడా మనుష్యులు అక్కడనుండి లేచి సొదొమ తట్టు చూచిరి. అబ్రాహాము వారిని సాగనంపుటకు వారితోకూడ వెళ్లెను. 17అప్పుడు యెహోవా – నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా? 18అబ్రాహాము నిశ్చయముగా బలముగల గొప్ప జనమగును. అతని మూలముగా భూమిలోని సమస్త జనములును ఆశీర్వదింపబడును. 19ఎట్లనగా యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించినట్లు నేనతనినెరిగియున్నాననెను. 20మరియు యెహోవా–సొదొమా గొమొఱ్ఱాలను గూర్చిన మొర గొప్పది గనుకను వాటి పాపము బహు భారమైనది గనుకను 21నేను దిగిపోయి నాయొద్దకు వచ్చిన ఆ మొర చొప్పుననే వారు సంపూర్ణముగా చేసిరో లేదో చూచెదను; చేయనియెడల నేను తెలిసికొందుననెను. 22ఆ మనుష్యులు అక్కడనుండి తిరిగి సొదొమా వైపుగా వెళ్లిరి. అబ్రాహాము ఇంక యెహోవా సన్నిధిని నిలుచుండెను.**

**వచనము 16**. ఈ ముగ్గురు పరలోక సంబంధమైన సందర్శకులు **అబ్రాహాము** మరియు శారాలను దర్శించుటలో తమ ప్రధాన ఉద్దేశ్యాన్ని నెరవేర్చిన తరువాత కదిలి వెళ్లుటకు సమాయత్తమయ్యారు. ఒక మంచి ఇంటివానిగా తమ ప్రయాణంలో కొంత భాగము వరకు పితరుడు వారితో కూడా నడచాడు. హెబ్రోను

పర్వతములకు తూర్పున సుమారు మూడు మైళ్ల దూరము నడిచియుంటారు, ఇక్కడ నుండే తూర్పున సుమారు పదునెనిమిది మైళ్ల దూరంలో ఉన్న మృత సముద్రము కొంత భాగాన్ని చూడవచ్చు. **ఆ మనుష్యులు ... సొదొమ తట్టు చూచిరి** అని ఇక్కడ కథనం చెబుతుంది.

ప్రాచీన "సొదొమ" యొక్క ఖచ్చిత స్థలము ఇప్పటికి తెలియనిదిగానే ఉంది, కాని చాల మంది అది మృత సముద్రమునకు దక్షిణ అంచున ఉన్నదని అనుకుంటారు. మృత సముద్రమునకు ఆగ్నేయ నైరుతి భాగాలలో కొన్ని త్రవ్వకాలు జరిగాయి, అలాగే దాని ఉత్తరపు మరియు దక్షిణపు కొనలలో కూడా. కొన్ని అవశేషాలను కనుగొన్నను, ఈ పట్టణములలో ఏదైనా పరిశుద్ధ గ్రంథంలో చెప్పబడిన లోతు యొక్క నివాస స్థలముగా ఉన్నాయా అనేదానికి ఒకే అంగీకారం లేదు. కొందరు ఈ సొదొమ యొక్క శిథిలాలు సముద్రము యొక్క నీటి అడుగులో ఉన్నాయని నమ్ముతారు, మరికొందరు దాని శిధిలాలు ఇంకను ఆ భూమి దిగువనే ఉన్నాయని అంటూ ఈ నిర్మాణములను వెలికి తీయడానికి పురావస్తు శాఖ యొక్క గడ్డపారల కోసం మాములుగా ఎదురు చూస్తున్నారు.[7]

**వచనము 17**. ఈ దృశ్యంలో **యెహోవా** అబ్రాహాము గురించి మాట్లాడాడు, కాని ఆయనతో కాదు. దేవుడు తనలో తానూ మాట్లాడుకున్నాడు అనో లేక ఆయనతో వచ్చిన ఆ ఇద్దరు దూతలతో బిగ్గరగా మాట్లాడాడో అని ఈ వాక్యము చెప్పుట లేదు; అయినప్పటికీ, ఈ రెండవ విధానం సంభాషణ పద్ధతి అయితే, తన మాటలను అబ్రాహాము వినకుండా మొదట ఆయన దీనిని చేసి ఉంటాడు.

ఇక్కడ దేవుని ప్రశ్న **నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా?** తరువాతి బైబిల్ చరిత్రలో, ఈ ప్రశ్న మరలా తలెత్తుతుంది, కాని ఇది ఒక ప్రశ్న రూపంలో కంటే ఒక నిశ్చిత వాక్యరూపంలో కనబడుతుంది. ఆమోసు ద్వారా యెహోవా ప్రకటించాడు, "తన సేవకులైన ప్రవక్తలకు తానూ సంకల్పించినదానిని బయలుపరచకుండ ప్రభువైన యెహోవాయేమియు చేయడు" (ఆమోసు 3:7). ఈ ప్రపంచంలో దేవుడు ఏమి చేయ సంకల్పించాడో అన్న సమాచారమును (20:7లో "ప్రవక్త"గా పిలువబడిన) అబ్రాహాము మరియు ప్రవక్తలైన ఆయన తరువాతి వారికి దేవుడు బయలుపరచాడని ఈ వాక్యం సూచిస్తుంది.

**వచనము 18**. అబ్రాహామునకు తన ప్రణాళికలను బయలుపరచుటలో దేవుని ప్రధానమైన ఉద్దేశ్యం: ఆయన బలముగల గొప్ప **జనమగును** గనుక. ఈ వాక్యము 12:2; 13:16; 15:5; 17:4–6 వచనములలో నమోదుచేయబడిన వాక్యములను పోలినదిగా ఉంది; కాని, "గొప్ప" అనే పదము చేర్చుట 12:2 లోని అసలు వాగ్దానమును మెరుగుపరుస్తుంది. పితరునికి బయలుపరచుటకు దేవునికి ఉన్న రెండవ ఆధారం ఏమనగా **అతని మూలముగా భూమిలోని సమస్త జనములును ఆశీర్వదింపబడును**. 14:13–24 వచనములలో అబ్రాహాము కొందరికి ఎలా ఆశీర్వాదముగా ఉన్నాడో చూచాము: సొదొమ రాజు మరియు అతని ప్రజలు;

లోతు మరియు ఆయన కుటుంబము; అమోరీయులైన ముగ్గురు సహోదరులు; మరియు షాలేము రాజైన మెల్కీసెదెకు. మరలా 18:23–33లో లోతు వలె దుష్ట పట్టణమైన సొదొమలో ఉన్న వారికి కూడా ఆశీర్వాదముగా ఉంటాడు అని చదువుతాం. వారికి బదులుగా దేవుని ఎదుట వారి కొరకు విజ్ఞాపన చేయుట ద్వారా ఆయన ఇది చేస్తాడు.

**వచనము 19**. అప్పుడు మనుషులపై మరియు జాతులపై అబ్రాహాము యొక్క ప్రభావము బహు గొప్పదిగా ఎందుకు ఉంటుందో దేవుడు చెప్పాడు: **నేను ఆయనను ఎరిగియున్నాను.** "నేను ఆయనను ఎరిగి [יָדַע, *yada'*] యున్నాను" అని హెబ్రీ వాక్యభాగం అక్షరాలా చెబుతుంది. యెహోవా పితరుని చాల అన్యోన్యంగా ఎరిగియున్నాడు. *yada'* అను పదమునకు, ఒక దాని గూర్చి కలిగియున్న ప్రాథమిక లేక సమగ్ర జ్ఞానముతో నిమిత్తము లేకుండా, ఒక దానిని లేక ఒకరిని "ఎరిగి" ఉండుటయని అర్థం. దేవునికి మరియు ప్రజలకు మధ్య ఉన్న సంబంధము వలె వ్యక్తిగత జ్ఞానము విషయమైన లోతైన అర్థమునకు వర్తిస్తుంది. అట్టి జ్ఞానము దేవుని హృదయమును మరియు ఆయన ధర్మశాస్త్రమును ప్రజలు తెలిసికొనినప్పుడు సాధ్యమౌతుంది (సామెతలు 2:5; యెష. 11:2; 58:2; యిర్మీయా 22:16; హోషేయా 4:1, 6; 6:6). ఈ తదుపరి ప్రయోగంలో, *yada'* అనే పదము భార్య మరియు భర్తకు మధ్య ఉండే అన్యోన్య జ్ఞానమునకు పోలినదిగా ఉంది. మరియు అందువలన ఆదికాండములో లైంగిక సంబంధములకు ఇది సభ్యోక్తిగా ఉంది (4:1, 17, 25; 19:8; 24:16; 38:26).

కొన్ని అనువాదములు (NASB; NIV; NRSV) *yada'* అను పదమును ఈ వాక్యంలో "ఏర్పాటు" చేసుకున్నట్లుగా అనువదిస్తాయి, అయినప్పటికీ అవి ప్రక్కబద్దెలో వ్రాయబడిన వ్రాతలలో ఈ పదమునకు అక్షర అర్థము "ఎరిగియుండుట" అని కూడా చెప్తాయి. 19వ వచనంలో *yada'* అను పదమునకు "ఏర్పాటు" చేయబడుట అనునది సరియైన అనువాదం కాదు. ఎందుకంటే, దేవుడు ఇష్టపూర్వకంగా మరియు టేషర తుగా కొంతమందిని రక్షణకు ఏర్పరచుకుంటాడు (లేదా ఎన్నుకుంటాడు) అని తరచుగా అపార్థం చేసుకోవడమైనది. అదే విధంగా ఈ విషయంలో ఎటువంటి అవకాశం లేకుండా ఎన్నిక లేనివారు నిత్యత్వమునకు నాశనమౌతారు అనే పొరపాటు అర్థాన్ని ఇది ఇస్తుంది.[8] సుస్పష్టంగా, 18:19లోని అసలు విషయమునకు అబ్రాహాము యొక్క వ్యక్తిగత రక్షణ కొరకైన దైవిక ఏర్పాటుకు (లేదా ఎన్నికకు) ఎటువంటి సంబంధము లేదు. దేవుడు పితరుని అన్యోన్యంగా ఎరిగియున్నాడు, (*yada'*) మరియు ఒక దైవికమైన కార్యాన్ని లేదా పనిని నెరవేరుస్తాడు అనే ఆశతో ఆయనతో ఒక వ్యక్తిగత సంబంధంలోనికి ప్రవేశించాడు అని రచయిత ఉద్ఘాటిస్తున్నాడు.[9]

అబ్రాహాముకు అప్పగింపబడిన పనికి గల మొదటి భాగమునకు పునాది పని దేవుడే చేసాడు. అసాధ్యమైనవాటిని సాధ్యపరచగల దేవునియందు

విశ్వసించులాగున అబ్రాహాము మరియు శారాలను దేవుడు నడిపిస్తున్నాడు. అంటే, వారి వృద్ధ వయసులో కూడా వాగ్దాన పుత్రుని వారు కనగలరు అన్న మాట. ఆదిలో వారిద్దరూ తమ విశ్వాసముతో పోరాడి అట్టి ఒక సలహా ఇవ్వబడినప్పుడు అవిశ్వాసంలో నవ్వారు; అయినప్పటికీ, వారి సందేహాలను అధిగమించుటకు దేవుడు వారితో కలిసి పనిచేసాడు. ఆఖరుగా, వారి విశ్వాసము "బలమునొంది"నట్లుగా లేఖన భాగము మనకు తెలియజేస్తుంది (రోమా. 4:18–21); "యెహోవాకు అసాధ్యమైనది" ఏదియు లేదని (18:14) వారు నమ్మారు.

అబ్రాహామునకు అప్పగింపబడిన పనిలో రెండవ భాగము ఆయనను ఒక మార్గదర్శిగా చూపిస్తుంది. తన తరువాత **తన పిల్లలును తన యింటివారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారి కాజ్ఞాపించినట్లు ఆయన** చేయబడ్డాడు (యెష. 1:10–17; హోషేయా 6:4–6; ఆమోసు 5:21–24; మీకా 6:6–8 చూడండి). సమాజమునకు ఒక గృహము అనునది పునాదియైన వ్యవస్థ కాబట్టి, అదే విద్యపరంగా ప్రాథమికమైన వ్యవస్థగా దేవుడు చేయనుద్దేశించుటను గూర్చి మనం ఆశ్చర్యపడకూడదు. దేవునితో ఉద్భవించిన ఆత్మీయ మరియు నైతిక పరమైన వారసత్వమును ప్రతి నూతన వంశమునకు తల్లిదండ్రులు అందించాలి (ద్వితీ. 6:1–9; ఎఫెసీ. 6:1–4). అబద్ధ దేవుళ్లను ఆరాధించే అన్యజనుల ప్రపంచంలో దేవుని యొక్క ప్రధానమైన ఆశయం ఆయనను "దేవుడు"గా ప్రత్యేకంగా ఆరాధించుటకంటే కూడా "నీతి న్యాయములు జరిగించుట"యే అయి ఉన్నది. ప్రత్యేకంగా ఆరాధించడం అనేది దేవుడు అనుకునే ఉంటాడు, ఎందుకంటే అబ్రాహాము విగ్రహారాధనను విడచి ఒక శతాబ్దముగా యెహోవాను మాత్రమే ఆరాధిస్తూ సేవిస్తున్నాడు గనుక.

దేవుని యొక్క వాక్యములో ఆఖరు అంశము అబ్రాహామునకు యెహోవా చేసిన వాగ్దానములు కొందరు అనుకుంటున్నట్లుగా కాకుండా షరతులతో కూడుకున్నవిగా ఉన్నాయి. పితరుని యొక్క విధేయపూర్వకమైన విశ్వాసమును బట్టి అవి నెరవేర్చబడ్డాయి. అబ్రాహాము "యెహోవా మార్గములను" అనుసరించెను (22:15–18; 26:5; రోమా. 4:16 చూడండి). **యెహోవా అబ్రాహామును గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు** అట్టి ఒక స్పందన అవసరమైయున్నది. భూమిలోని కుటుంబములన్నిటిని ఆశీర్వదించాలనే దేవుని ప్రణాళిక (12:3) అబ్రాహాముతోనే ప్రారంభమావ్వాల్సి ఉంది. ఆయన తిరిగి తన కుటుంబమునకు దేవుని చిత్తమును ఇవ్వవలసిన ఉంది. ఆయన తదుపరి సంతానము వారు వారి కుటుంబాలకు అందించవలసి ఉంది; మరియు ఆఖరుగా, అబ్రాహాము సంతానము–అంటే ఇశ్రాయేలు యొక్క బిడ్డలు–ఈ యావత్ప్రపంచమునకు దేవుని గూర్చిన జ్ఞానమును అందించుటకు ఒక కాలువగా ఉండవలసి ఉన్నారు (నిర్గమ. 19:4–6; యెష. 42:6; 49:6).

**వచనము 20**. తన సొంత ప్రశ్నకు యెహోవాయే జవాబు ఇచ్చాడు.

అబ్రాహాము తనను వినకుండునట్లుగా ముందుగానే ఇలా మాట్లాడి ఉంటే, ఈ సారి పితరుడు వినునట్లుగా సరిపడినంత బిగ్గరగా ఖచ్చితంగా మాట్లాడాడు. **సొదొమా గొమొఱ్ఱాలను గూర్చిన మొర గొప్పది గనుకను వాటి పాపము బహు భారమైనది గనుకను** అని ఆయన అన్నాడు. "మొర" అనే పదము బహుశా దుష్టులైన తమ హింసాత్ముల చేతిలో కష్టమును మరియు అవినీతిని చవిచూస్తున్న బాధితుల యొక్క ప్రలాపములను మరియు వేదనలను సూచిస్తుంది (నిర్గమ. 2:23; 3:7, 9; ద్వితీ. 26:7; న్యాయాధి. 10:12; నెహెమ్యా 9:9; యోబు 34:28; కీర్తన. 9:12; సామెతలు 21:13 చూడండి). తరువాత, ఇశ్రాయేలు మరియు యూదా అనే రెండు రాజ్యములు చేసిన సామాజిక అన్యాయాలను ప్రవక్తలు ప్రాచీన సొదొమా మరియు గొమొఱ్ఱా పట్టణములు చేసిన అన్యాయములతో పోల్చారు (యెష. 1:3, 4, 9, 10, 21–23; యెహెజ్కేలు 16:46–49; ఆమోసు 4:1, 11). క్రొత్త నిబంధనలో సొదొమా ప్రజల యొక్క పాపములు మరియు నేరముల నిమిత్తము యెహోవా ఎదుట లోతు నిరసనతో విలపించినట్లుగా ఎక్కడా చెప్పబడలేదు. అయినను, వారి జీవితములు భక్తిహీనతతోనూ, కామవికార యుక్తమైన నడవడికతోనూ, మరియు దుర్మార్గ క్రియలతోను నిండినట్లుగా పేతురు వివరించాడు; మరియు ఈ కార్యములు అనుదినము లోతు యొక్క నీతిగల మనస్సును వేధించాయని చెప్పాడు (2 పేతురు 2:6–8).

**వచనము 21**. "సొదొమా మరియు గొమొఱ్ఱాలను గూర్చిన మొరను" వినిన తరువాత (18:20), దేవుడు నేను **దిగిపోయి నాయొద్దకు వచ్చిన ఆ మొర చొప్పుననే వారు సంపూర్ణముగా చేసిరో లేదో చూచెదను** అనుకొనెను (4:10; 11:5, 7; 19:13 చూడండి). చేయని యెడల ఈ విషయమును గూర్చిన సత్యమును నేను తెలిసికొందుననెను. దేవుడు తొందరపడి లేక వదంతులను నమ్మి సొదొమా గొమొఱ్ఱా పట్టాణముల యొక్క స్థితులను తీర్పుతీర్చడని అబ్రాహాము తెలుసుకోవాలని దేవుడు అనుకున్నాడు. దీనికి బదులు, నిజ నిర్ధారణ పనిలో క్రిందికి వెళ్లి వారి మొరల యొక్క స్వభావము నేరముల మరియు హింసల స్వభావములతో పోలినవిగా ఉన్నాయో లేదో చూడాలనుకున్నాడు. దేవుడు క్రిందికి వెళ్లి చూడాలి అనుకొనుట అనే వాక్యమును అక్షరాలా అర్థం చేసుకోకూడదు ఎందుకంటే దేవుడు మనుషుల వలె సమయమును మరియు యుగాలను బట్టి పరిమితమయ్యేవాడు కాడు (కీర్తన. 139:7–12). ప్రజలు ఏమిచేస్తున్నారో వారు ఎటువంటి జీవితములను జీవిస్తున్నారో ఆయన చూస్తున్నాడు ఎరిగియున్నాడు (సామెతలు 15:3; యిర్మీయా 23:24; హెబ్రీ. 4:13).

**వచనము 22**. ఈ సమయములో ఆ **మనుష్యులు** [దూతలు] **అక్కడనుండి తిరిగి సొదొమా వైపు తమ ప్రయాణమును కొనసాగించారు, అబ్రాహాము ఇంకా యెహోవా సన్నిధిని నిలిచుండెను**. యూదుల పరంపర ప్రకారము, హెబ్రీ పరిశుద్ధ గ్రంథంలో శాస్త్రుల చేత సవరించబడిన పదునెనిమిది వచనములలో ఇది ఒకటి,

ఎందుకంటే ఇక్కడ విషయము అమర్యాదకరంగా ఉన్నట్లుగా భావించారు. వారి పరంపర ప్రకారముగా ఈ వచనము యొక్క రెండవ భాగము అసలు ఇలా ఉండేది: “అబ్రాహాము ముందు యెహోవా ఇంకను నిలిచియుండగా” (NAB; NJB; TEV; NCV; CEV; NLT చూడండి).[10] అయినను, ఇదే వాక్యము MT అనువాదంలోని 18:22 మరియు 19:27లలో ఉన్నందున ఈ వచనము సవరించబడి ఉంటుంది. “తెల్లవారినప్పుడు అబ్రాహాము లేచి తాను యెహోవా సన్నిధిని నిలిచినచోటికి వచ్చి” అని ఈ రెండవ వచనము చెప్తుంది.

“సన్నిధిని నిలిచెను” అనే భావము పాతనిబంధనలోసాధారణమైనది. దేవుని “సన్నిధిలో నిలుచుట” అంటే ఆయనను ఆరాధించుట (యిర్మీయా 7:10), ఆయన సన్నిధిలో ప్రవేశించుట (ద్వితీ. 19:17; 29:14, 15), లేదా ఆయనను సేవించుట (1 రాజులు 17:1; 18:15; 2 రాజులు 3:14; 5:16). ఇక్కడ ఈ పదసమూహము వేరే విధంగా ప్రయోగించబడింది, ఇది ప్రవక్త యొక్క విజ్ఞాపనా పరిచర్యను సూచిస్తుంది.

చాలా సంవత్సరముల తరువాత యెహోవా యిర్మీయాతో అన్నాడు, “మోషేయు సమూయేలును నాయెదుట నిలువబడినను ఈ ప్రజలను అంగీకరించుటకు నాకు మనస్సుండదు” (యిర్మీయా 15:1). ఆ తరువాత, ఇదే అధ్యాయములో, యిర్మీయా ఏకాంతంగా కూర్చొన్నాడు; ఆయన సందేశాన్ని దేవుని ప్రజలు తిరస్కరించి ఆయనను హింసించినందున ఆయన కోపోద్రిక్తుడై నిరాశతో ఉన్నాడు. ఈ భంగపాటులో ఆయన దేవుని “నిలువని జలము” అవుదువా (యిర్మీయా 15:18) అని నిందిస్తూ ప్రశ్నించాడు, కాని నిజానికి దేవుడు ప్రవక్తను మోసగించలేదు. నిజానికి, తనకు నోటిమాటగా ఉండుటకు దేవునిచే పిలువబడినప్పుడు, ఆ జనాంగము మరియు ప్రజల యొక్క నాయకులు తన ప్రకటనను వ్యతిరేకించి తనకు విరుద్ధంగా పోరాడతారని దేవుడు ముందుగానే చెప్పాడు. అట్టి వ్యతిరేకత ఉన్నప్పటికీ, దేవుడు తన సేవకునితో ఈ విధంగా వాగ్దానము చేసాడు: “నిన్ను విడిపించుటకు నేను నీకు తోడైయున్నాను” (యిర్మీయా 1:8, 17–19), మరియు నిజంగానే ఆయన వారిని విడిపించాడు. కాబట్టి, యెహోవా యిర్మీయాకు హెచ్చరించాడు, “నీవు నా తట్టు తిరిగిన యెడల నీవు నా సన్నిధిని నిలుచునట్లు నేను నిన్ను తిరిగి రప్పింతును” (యిర్మీయా 15:19). ఇంకొక విధంగా చెప్పాలంటే, దేవునిపై ఆయన చేసిన తప్పుడు నిందలను బట్టి ఆయన పశ్చాత్తాప పడితే, తన ప్రవక్త పరిచర్యను కొనసాగిస్తూ అవిధేయులైన దేవుని ప్రజలకు బదులుగా విజ్ఞాపనను చేయుటకు కొనసాగిస్తాడు.

18:22లో అబ్రాహాము “యెహోవా సన్నిధిని నిలుచుండెను” అనేది యూదా రాజ్యము ముగింపు కాలంలో ప్రవక్తలు చేసిన పనిని పోలినదిగా ఉంది. అది విజ్ఞాపనాయుక్తమైనదిగా ఉంది, కాని ద్వేషం, సణుగుడు, మరియు దేవునిపై యిర్మీయా వేసినట్లుగా తప్పుడు నిందలు లేనిదిగా ఉండేది. ఇంకను, కష్ట

కాలములో ఈ ఇద్దరు మనుష్యులు కూడా యెహోవా యొక్క నీతిగల మరియు న్యాయమైన కార్యములను గూర్చిన నిశ్చయత అవసరమై ఉన్నారు. యిర్మీయా హింసను మరియు తిరస్కారమును అనుభవించులాగున యెహోవా చేసియున్నాడు, కాగా అబ్రాహాము అయితే లోతు మరియు ఆయన కుటుంబము సొదొమా గొమొఱ్ఱాల పై త్వరలో రాబోయే వినాశనములో కొట్టుకుపోతారేమో అనే విషయమును గూర్చి కొంచెం చింత కలిగియున్నాడు.

## సొదొమ మరియు గొమొఱ్ఱాలను గూర్చి అబ్రాహాము చేసిన విజ్ఞాపన (18:23–33)

**[23]అప్పుడు అబ్రాహాము సమీపించి యిట్లనెను – దుష్టులతోకూడ
నీతిమంతులను నాశనము చేయుదువా? [24]ఆ పట్టణములో ఒక వేళ ఏబదిమంది
నీతిమంతులుండినయెడల దానిలోనున్న యేబదిమంది నీతిమంతుల నిమిత్తము
ఆ స్థలమును నాశనముచేయక కాయవా? [25]ఆ చొప్పున చేసి దుష్టులతో కూడ
నీతిమంతులను చంపుట నీకు దూరమవునుగాక. నీతిమంతుని దుష్టునితో
సమముగా ఎంచుట నీకు దూరమవు గాక సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు
న్యాయము చేయడా అని చెప్పినప్పుడు [26]యెహోవా–సొదొమ పట్టణములో
ఏబదిమంది నీతిమంతులు నాకు కనబడినయెడల వారినిబట్టి ఆ స్థలమంతటిని
కాయుదుననెను. [27]అందుకు అబ్రాహాము–ఇదిగో ధూళియు బూడిదెయునైన నేను
ప్రభువుతో మాటలాడ తెగించుచున్నాను. [28]ఏబదిమంది నీతిమంతులలో ఒకవేళ
ఐదుగురు తక్కువైతే ఐదుగురు తక్కువైనందున ఆ పట్టణమంతయు నాశనము
చేయుదువా అని మరల అడిగెను. అందుకాయన–అక్కడ నలుబది యైదుగురు
నాకు కనబడినయెడల నాశనము చేయననెను. [29]అతడింక ఆయనతో
మాటలాడుచు–ఒకవేళ అక్కడ నలుబదిమందియె కనబడుదురేమో అనినప్పుడు
ఆయన–ఆ నలుబదిమందిని బట్టి నాశనముచేయక యుందునని చెప్పగా
[30]అతడు–ప్రభువు కోపపడనియెడల నేను మాటలాడెదను; ఒకవేళ అక్కడ
ముప్పదిమందియే కనబడుదురేమో అనినప్పుడు ఆయన–అక్కడ ముప్పదిమంది
నాకు కనబడినయెడల నాశనము చేయననెను. [31]అందుకతడు–ఇదిగో ప్రభువుతో
మాటలాడ తెగించితిని; ఒకవేళ అక్కడ ఇరువదిమంది కనబడుదురేమో
అనినప్పుడు ఆయన–ఆ యిరువది మందినిబట్టి నాశనము చేయకుందుననగా
[32]అతడు–ప్రభువు కోపపడ నియెడల నేనింకొకమారే మాటలాడెదను; ఒకవేళ
అక్కడ పదిమంది కనబడుదురేమో అనినప్పుడు ఆయన–ఆ పదిమందినిబట్టి
నాశనము చేయక యుందుననెను. [33]యెహోవా అబ్రాహాముతో మాటలాడుట
చాలించి వెళ్లిపోయెను. అబ్రాహాము తన యింటికి తిరిగి వెళ్లెను.**

**వచనములు 23, 25.** మోషే **అబ్రాహామును** ఒక మాదిరియైన అతిథిగా చూపించాడు, కాని ఇక్కడ లోతు మరియు తన కుటుంబము తమకు గృహమును చేసుకున్న సొదొమ అనే దుష్టపట్టణమును గూర్చి విజ్ఞాపన చేసిన ఒక దయగల ప్రవక్తగా వర్ణించాడు (20:7 చూడండి). దేవుడు న్యాయమును జరిగించకుండా ఉండాలి అని పితరుడు అనుకొనుటలేదు. లేదా అబ్రాహాము యెహోవా యొక్క నీతిని ప్రశ్నించుటలేదు. ఇక్కడ ప్రశ్న **దుష్టులతోకూడ నీతిమంతులను నాశనము చేయుదువా?** (18:23) అనుదాని ద్వారా దేవుడు అపరాధులతో కూడా అమాయకులను నాశనము చేస్తాడేమోనన్న తన చింతను తెలుపుతున్నాడు. పితరుని ఆలోచన ప్రకారం, నిజమైన న్యాయం అనునది దేవుడు నీతిమంతులను (צַדִּיק, *tsaddiq*) మరియు దుష్టులను వేరుగాచూస్తూ మొదట పేర్కొనబడిన వారిని రక్షించి రెండవదిగా పేర్కొనబడిన వారిని మాత్రమే శిక్షించాలని ఎదురుచూస్తుంది. మంచి మరియు చెడుల మధ్యగల వ్యత్యాసము అనునది పరిశుద్ధ గ్రంథంలో తరచుగా వచ్చే అంశంగా కనబడుతుంది, మరియు ఇది యుగాంతంలో కడవరి తీర్పునకు ఆధారముగా ఉంది (ప్రకటన 20:11–15; 21:7, 8, 27; 22:11–15).

బహుశా అబ్రాహాము సొదొమ యొక్క దుష్టత్వమును గూర్చి తెలుసుకుని ఉంటాడు (13:13), ఎందుకంటే వారి పాపము యొక్క గాంభీర్యాన్ని దేవుడు అంచనా వేసినప్పుడు ఎదిరించుటకు ప్రయత్నించ లేదు. అయినప్పటికీ ఆయన మనస్సులో ఎక్కువగా ఉన్నది అక్కడ నివసించిన లోతు మరియు ఆయన కుటుంబము. పితరుని సహోదరుని కుమారుని గూర్చి మనకు ఇప్పటికే తెలిసినదానిని బట్టి మరియు 19వ అధ్యాయంలో నమోదు చేయబడిన దానిని బట్టి, అధిక నీతిమంతులైన వ్యక్తుల జాబితాలో లోతు అంత ఎక్కువగా అనిపించుకోలేడు. మరో వైపు, పేతురు ప్రాచీన సొదొమ పట్టణస్తులతో లోతును పోల్చినప్పుడు ఆయనను గూర్చి "నీతిమంతుడు"గా (δίκαιος, *dikaios*, అనునది *tsaddiq*నకు పోలినదిగా ఉంది) పలికాడు (2 పేతురు 2:6–8). ఈ విధమైన వ్యత్యాసము తరచుగా ధర్మశాస్త్రములోను, ప్రవక్తలలోను, మరియు కీర్తనలలోను వస్తుంది. ఉదాహరణకు, "యెహోవా నీతిమంతులను ప్రేమించువాడు ... భక్తిహీనుల మార్గమును ఆయన వంకరమార్గముగా చేయును" (కీర్తన. 146:8, 9).

సొదొమను గూర్చి అబ్రాహాము చేసిన విజ్ఞాపనలో నీతిమంతులను మరియు దుష్టులను దేవుడు ఒకే రీతిగా పరిగణించడం ఊహించలేనిదిగా మూడు సార్లు తెలిపాడు. ఈ ఆలోచనకు ఆయన మరలివచ్చిన ప్రతిసారీ, అట్టి క్రియలకు ఆయన అభ్యంతరాన్ని పదును చేయుటకుగాను తన భాషను మార్చాడు. మొదటిగా, దేవుడు "దుష్టులతోకూడ నీతిమంతులను నాశనము చేయునా?" అని దేవుని అడిగాడు (18:23). ఈ ప్రశ్న దేవుని విషయంలో కొంత పొరపాటును సూచిస్తుంది;

ఆయన తన ఉగ్రతను నిర్భేధ్యంగా నీతిమంతులపైనా మరియు చెడుతనము జరిగించువారిపైన కూడా పంపిస్తాడేమో అని ఇది సూచిస్తుంది.

రెండవ అభ్యంతరం ఇంకా బలంగా ఉంది; దుష్టులతో కూడ **నీతిమంతుని దుష్టునితో సమముగా** ఎంచుట అనే ఆలోచనను చూసి పితరుడు వెనుకకు యెగిసాడు (18:25a). "నాశనము" (מות, *muth*) చేయుట అంటే "చంపుట"; ఇది తరువాతి కాలంలో దేవుని ధర్మశాస్త్రాన్ని ఆచరించే విషయంలో అపరాధియైన వానికి విధించే మరణ దండనకు పరిభాషగా మారింది (లేవీ. 20:2; సంఖ్యా. 35:19, 21). అబ్రాహాము ప్రశ్న యొక్క ప్రధానమైన ప్రతిపాదన ఏమంటే నీతిగా జీవించేవారు చెడిపోయిన సమాజమును కాపాడగలిగే నైతిక విలువలను ఉత్పన్నం చేస్తారు లేదా ఈ చెడ్డ సమాజం దేవుని తీర్పు వలనబెదిరించబడుతుంది. ఆయన ఆలోచన ప్రకారంగా, దేవునికి పరిశుద్ధమైన ఒక శేషముగా పదిమంది నీతిమంతులు అనేకమంది అవినీతిమంతుల కంటే ముఖ్యులు. అబ్రాహాము మరియు ఆయన సంతానము ద్వారా భూమిలోని సమస్త జనులను ఎలా ఆశీర్వాదములను కనుగొనవలసి ఉన్నాయో అలాగే సొదొమలోని అపరాధులు ఘోరమైన నేరములు చేయని అనేకమంది అమాయకులైన తమ తోటి పౌరుల జీవితాలలో కరుణను కనుగొంటారు. ఒక విధంగా, దుష్టుల స్థానంలో నీతిమంతులు ప్రత్యామ్నాయంగా జీవిస్తారు.

అబ్రాహాము తెలిపిన మూడవ అభ్యంతరం కూడా ఇలానే ఉంది: దేవుడు నీతిమంతులను మరియు దుష్టులను ఒకే విధంగా పరిగణిస్తాడు అనేది ఆయనకు ఆలోచించలేని విషయం. అట్టి ఒక ఆలోచన వలన ఆయన తిప్పికొట్టబడ్డాడు, మరియు ఆయని ప్రశ్నలో ఆయన దయ స్పష్టమౌతుంది, **సమముగా ఎంచుట నీకు దూరమవు గాక. సర్వలోకమునకు తీర్పు తీర్చువాడు న్యాయము చేయడా** (18:25b). ఇందుమూలంగా పితరుడు దేవునితో చెప్పినది ఏమంటే, నీతిమంతులను "నాశనము" (చంపితే) చేస్తే తనను తానే అభిశంసనము చేసుకోవాలి అని. పరిశుద్ధ గ్రంథంలోని ప్రాథమిక సత్యాలలో ఒకటి, ఈ లోకమును అందులోని సమస్తాన్ని సృష్టించిన యెహోవా మానవులతో ఆయన కార్యముల విషయంలో నీతిమంతుడు మరియు న్యాయమంతుడు. కొన్ని సార్లు ఆయన అన్యాయంగా చేస్తున్నట్లు అనిపించినా ఇది సత్యము (ద్వితీ. 32:4, 5; కీర్తన. 9:7–9; 96:10; 97:1, 2; రోమా. 2:5–11).

**వచనములు 24, 26–33.** ఒకవేళ సొదొమ పట్టణములో కేవలం **ఏబదిమంది నీతిమంతులు** ఉన్నచో దేవుడు దానిని కాపాడతాడా అని అబ్రాహాము దేవుని ప్రశ్నించాడు (18:24). ఈ ప్రతిపాదనకు దేవుని అంగీకారాన్ని పొందినవాడై (18:26), ఒకవేళ అక్కడ **నలుబదియైదు** మంది నీతిమంతులు ఉన్నచో శిక్షను తప్పించమని యెహోవాను బలవంతం చేసాడు (18:28). మరలా, అబ్రాహాము యొక్క సలహాకు దేవుడు ఒప్పుకున్నాడు; కాబట్టి రెండుసార్లు పితరుడు ఆ

సంఖ్యను ఐదుతో తగ్గించాడు, “ఏబది” నుండి **నలుబదియైదు** నుండి నలుబది వరకు (18:29).

దేవునితో ఈ విధంగా ప్రశ్నల పరంపర కొనసాగిస్తూ అహంకారిగా లేదా అమర్యాదకరంగా ఉండాలని పితరుడు అనుకోలేదు; కాబట్టి, తాను **ధూళియు బూడిదెయు** అని ఒప్పుకున్నాడు (18:27). ఈ పదములు ఆయనలోని మానవ దౌర్బల్యమును తెలుపుతున్నాయి; వాడు “మరణమునకు అప్పగింపబడి దుమ్ముకు తిరిగి రావలసినవాడిగా ఉన్నాడు” (2:7; 3:19; యోబు 30:19; కీర్తన. 103:14).[11] అయినప్పటికీ, అబ్రాహాము అనుకూల సమాధానములు పొందియుండగా, ఇంకను ధైర్యము తెచ్చుకుని ఆ సంఖ్యను పదితో మూడు సార్లు తగ్గించాడు, “నలుబది” నుండి **ముప్పది నుండి ఇరువది** నుండి **పది** వరకు (18:30−32). ఈ విషయమును ఇంకను పితరుడు ఒత్తిడి చేస్తుండగా, ఆయన అహంకారంగా లేడు; విరుద్ధంగా, ఆయన క్షమార్హంగా ఉన్నాడు, మరియు సొదొమలోని నీతిమంతులకు కరుణ కొరకు వేడుకొనుచుండగా **తనపట్ల కోపంగా** ఉండవద్దని రెండుసార్లు దేవుని అడిగాడు (18:30, 32).

తన అంతిమ విన్నపమునకు ముందు, దేవుని ఎంతవరకు అడుగుటకు తెగించాడో ఆ పరిమితి దగ్గరకు చేరాడని అబ్రాహాము బహుశా భావించి ఉంటాడు. కాబట్టి, సొదొమ యొక్క వినాశనమును గూర్చి **ఇంకొకమారే** మాట్లాడతానని అన్నాడు. ఒకవేళ “పది” మంది నీతిమంతులు **అక్కడ కనబడుదురేమో**, అప్పుడు ఈ పదిమందిని బట్టి పట్టణమును కాపాడుటకు వీలౌతుందా అని దేవుని అడిగాడు (18:32). పితరుని యొక్క సమర్మక విచారణ ప్రశ్నలను యెహోవా భరించాడు, తద్వారా తీర్పులో దేవునికుండే ఒకవిధమైన సహనమును గూర్చిపేతురు తరువాత కాలంలో పేర్కొన్న దానిని వెల్లడి చేసాడు. దేవుని యొక్క ప్రాథమికమైన స్వభావం ఏమంటే “ఎవడును నశింపవలెనని యిచ్ఛయింపక, అందరు మారుమనస్సు పొందవలెనని” కోరుతున్నాడు (2 పేతురు 3:9). ఇంకొక విధంగా చెప్పాలంటే, “దేవుడు ప్రేమ” గనుక (1 యోహాను 4:8), ఆయన మొదటి మొగ్గు దండించడమో లేక నాశనం చేయడమో కాదు, కాని ఆయన పరిశుద్ధత మరియు నీతి రాజీపడనంత వరకు క్షమించి రక్షించడమే. దీనికి అర్థము యెహోవా ఎలా ప్రవర్తించాలి అంటే పాపములు అసలు పట్టనట్లుగా చూచిచూడకుండా పోయే అధికానందం కలిగిన ఒక ముసలి తాతయ్య వలె దేవుడు ఉంటాడు అని దుర్మార్గులు ఆలోచించుటకు ఎన్నటికిని కారణములు లేకుండా ఉండాలి. వారి సంభాషణ ముగిసిన కారణాన, **యెహోవా అబ్రాహాముతో మాటలాడుట చాలించి వెళ్లిపోయెను**. అబ్రాహాము తన యింటికి తిరిగి వెళ్లెను (18:33) − అంటే, “మమ్రే దగ్గరనున్న సింధూర వనము”నకు (18:1).

# అన్వయము

## విశ్వాసము కలిగిన మనుష్యుడు (అధ్యాయము 18)

*విశ్వాస జనాంగము ఊహించలేని సందర్శకులు వచ్చినప్పుడు కృపాసహితంగా స్పందిస్తారు* (18:1–8). దినము యొక్క వేడిమిలో తన గుడారపు ద్వారము నొద్ద విశ్రాంతి తీసుకుంటున్న అబ్రాహాము నొద్దకు అకస్మాత్తుగా ముగ్గురు అపరిచితులు వచ్చినప్పుడు ఆశ్చర్యపడిపోయాడు. ఆయన లేచి వారిని స్వాగతించుటకు ఎదురు వెళ్లాడు, కాని వారు పరలోకం నుండి వచ్చిన సందర్శకులు అని వారిలో ఒకడు యెహోవాయే అని ఆయనకు తెలియదు. ఆయన చేసినట్లుగా వారిని స్వీకరించుకొనుట ద్వారా మరియు వారికి రుచికరమైన భోజనమును వడ్డించుట ద్వారా, విశ్వాస జనాంగమంతటికి పితరుడు ఆతిథ్యమును గూర్చిన ఒక మాదిరి అయ్యాడు.

హెబ్రీ ప్రత్రిక రచయిత క్రైస్తవులకు తమ సహోదరుల పట్ల ప్రేమ చూపిస్తూ ఆతిథ్యము చేయుట "మరవకుడి" అంటూ "దానివలన కొందరు ఎరుగకయే దేవదూతలకు ఆతిథ్యము చేసిరి" (హెబ్రీ. 13:2) అని పలికినప్పుడు అబ్రాహాము తన మనస్సులో ఉండి ఉంటాడు. ఈ పితరుడు వెల్లడి చేసిన ఆతిథ్య క్రియలను తన అనుచరులు చేయాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఆకలిగొన్న మరియు దప్పికగొన్న పరదేశులను మనం చూసే విధానం యెహోవా పట్ల మనకున్న నిజమైన సమర్పణను లేదా సమర్పణ లేమిని ప్రతిబింబిస్తుంది. తీర్పు దినమున పరిశీలించబడు శిష్యరికపు పరీక్షలలో మనం ఆకలిగొనిన వారికి ఆహారము ఇచ్చామా లేదా, దప్పిగొనినవారికి నీళ్లిచ్చామా లేదా, పరదేశులను మన గృహములలో చేర్చుకున్నామా లేదా అనే విషయాలు ఉంటాయి (మత్తయి 25:35). తీర్పును యేసు వివరించిన విధానంలో, రాజు అంటాడు, "మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరి" (మత్తయి 25:40).

*విశ్వాస జనాంగము దేవుని వాగ్దానములు ఒకవేళ నమ్మశక్యముగా లేకపోయినప్పటికీ వాటిపై ఆధారపడుట నేర్చుకోవాలి* (18:9–15). మీదటికి శారాకు కుమారుడు కలుగును అని దేవుడు వాగ్దానము చేసినప్పుడు అబ్రాహాము వలె ఆమె కూడా (17:17) అవిశ్వాసముతో నవ్వింది. వారి వయస్సులో ఉన్న ఇద్దరు మనుష్యులు—శారాకు ఎనభై తొమ్మిది మరియు అబ్రాహాముకు తొంబై తొమ్మిది సంవత్సరములు—సహజ పద్ధతిలో బిడ్డలను కనడం అసాధ్యం. అట్టి సంశయవాదమునకు యెహోవా స్పందన ఇలా ఉంది: "యెహోవాకు అసాధ్యమైనది ఏదైనా నున్నదా?" (18:14). వారి శరీరములు బిడ్డలను కనే విషయంలో "మృతతుల్యమైనను," అబ్రాహాము (మరియు శారా) "నిరీక్షణకు

ఆధారము లేనప్పుడు" కూడా దేవుడు వాగ్దానము చేసినదానిని "నెరవేర్చుటకు సమర్థుడు" అని రూఢిగా విశ్వసించారు (రోమా. 4:18–24). ఇస్సాకు జన్మతో దేవుని వాగ్దానముపై వారికున్న విశ్వాసము వారు మొదట విన్నప్పుడు నమ్మశక్యముగా లేకున్నను తరువాత రూఢి అయింది.

పౌలు కూడా ఈ అవిశ్వాసము అనే అంశమును గూర్చి మాట్లాడాడు, ముఖ్యంగా మృతుల పునరుత్థానము విషయంలో. మృతులు క్రీస్తు యొక్క రెండవ రాకడలో లేస్తారని కొన్నిసార్లు శ్రోతలు ఆయన బోధను సందేహించారు. నిత్య జీవితమునకు పునరుత్థానము విషయంలో కష్టపడుతున్న అన్యజనులైన క్రైస్తవులను ప్రోత్సహించుటకు పౌలు క్రీస్తు పునరుత్థానమును గూర్చి సుదీర్ఘమైన వివరణను ఇచ్చాడు (1 కొరింథీ. 15 చూడండి).

శరీర పునరుత్థానమును ఈనాడు సంశయము కలిగిన మనస్సులు ఏవైనా కారణముల చేత విస్మరిస్తాయి. క్రైస్తువులుగా పిలువబడే కొందరు కూడా ఇట్టి ఒక ఆలోచనను తిరస్కరిస్తారు; అయినప్పటికీ, ఆదిమ సంఘము యొక్క సంయుక్త సిద్ధాంతము శరీర పునరుత్థానమును బోధించింది. మొదటి శతాబ్దములో చాలా మందికి ఇది నమ్మశక్యముగా లేకపోయినప్పటికీ, యుగాలుగా ఉన్న ప్రేరేపితమైన సాక్ష్యము దీనిని విశ్వసించుటకు యోగ్యమైన అనేక కారణములు ఇచ్చింది.

మొదటిగా, దేవుడు మరియు యేసు ఇద్దరు కూడా క్రీస్తు మరణించి పునరుత్థానము చెందుటాడని చెప్పారు (యెష. 53:1–12; మత్తయి 16:21; యోహాను 10:17, 18; అపో. 2:22–24, 29–31).

రెండవది, అపొస్తలులు ఇంకా అయిదువందలకు పైగా సాక్ష్యులు యేసును సిలువ మరణము తరువాత సజీవునిగా చూసినట్లు సాక్ష్యమిచ్చారు. కొందరైతే ఆయనను ముట్టుకున్నారు మరియు ఆయనతో కూడా భుజించారు (లూకా 24:33–43; యోహాను 20:19, 20, 24–29; అపో. 2:32–36; 9:1–6; 22:6–10; 1 కొరింథీ. 15:1–8).

మూడవది, యేసు పునరుత్థానమును గూర్చి సాక్ష్యమిచ్చినవారు ఆయన పునరుత్థానమును గూర్చి అబద్ధ సాక్ష్యము ఇచ్చుట ద్వారా సంపదనుగాని, ప్రఖ్యాతినిగాని, లేదా హోదానుగాని ఏమీ పొందుకోలేదు. దీనికి భిన్నంగా, భౌతికపరమైన ప్రతిదానిని, అంటే స్నేహితులను, కుటుంబమును, ఆస్తిని మరియు వారి సొంత ప్రాణములను కూడా కోల్పోయారు. వారిలో చాలామంది అంతిమ వెలను చెల్లించారు ఎందుకంటే యేసును తన మరణము తరువాత సజీవంగా చూచామని సాక్ష్యమిచ్చుటకు వారు వెనుకాడలేదు.

నాలుగవది, మన పునరుత్థానమును గూర్చి ఖచితత్వమును ఇచ్చి భవిష్యత్తు గమ్యమును గూర్చి మనకు నిరీక్షణను ఇచ్చేది యేసు యొక్క పునరుత్థానమే. అదే సువార్త (శుభ వార్త); అది లేకుండా, పౌలు చెప్పినట్లుగా, మనమింకను పాపములోనే ఉన్నాను, మన విశ్వాసము వ్యర్థమే, మన

జీవితములు శూన్యము (1 కొరింథీ. 15:14–22). ఈ ప్రపంచంలో అనేకమంది సంశయాత్మక ఆలోచనలనే కలిగియుంటారు, అవి ఎట్టి నిరీక్షణను ఇవ్వలేవు. అయినప్పటికీ, క్రైస్తవులకు మరణము అనునది తన ముల్లును పోగొట్టుకొని విజయమందు మ్రింగబడింది ఎందుకంటే క్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచాడు గనుక. పాపము మరియు మరణముపై ఆయన పొందిన జయములో మనము కూడా పాలుపంచుకుంటాము, మరియు "మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందియున్నాము" (రోమా. 8:37; 1 కొరింథీ. 15:54–57 చూడండి).

*విశ్వాసజనాంగము దుష్టులపై దేవుడు పంపే తీర్పు న్యాయమైనది అని అర్థం చేసుకుంటారు* (18:16–22). యెహోవా అడిగాడు, "నేను చేయబోవు కార్యము అబ్రాహామునకు దాచెదనా?" (18:17). రెండు కారణముల చేత పితరునికి ఆయన ప్రణాళికను చెప్పాలని అనుకున్నాడు: (1) అబ్రాహాము "బలముగల గొప్ప జనముగా" అవ్వవలసి ఉన్నాడు, మరియు ఆయనలో "భూమిలోని సమస్త జనములును" ఆశీర్వదింపబడవలసి ఉన్నారు (18:18). కాబట్టి, (సొదొమ, గొమొఱ్ఱా, మరియు యోర్దాను లోయలో ఇతర పట్టణములలో; 19:24, 25) అనేకమంది ప్రజలు వారి చెడుతనమును బట్టి నాశనము కావలసి ఉండగా, అట్టి దైవికమైన కార్యమును గూర్చి దేవుడు పితరునికి వివరణ ఇచ్చాడు. (2) అబ్రాహాము తన తరువాత "తన పిల్లలును తన యింటి వారును నీతి న్యాయములు జరిగించుచు, యెహోవా మార్గమును గైకొన"వలెనని వారికి బోధించవలసి ఉంది (18:19). మానవునికి దేవుడు ఇచ్చే వాగ్దానములు దరిదాపుగా ఎల్లప్పుడూ షరతులతో కూడినవిగా ఉంటాయి; తిరుగుబాటు చేయువారి మీద దేవుడు తన ఆశీర్వాదములను బలవంతంగా రానియ్యడు. అబ్రాహాము సంతానమును దేవుడు ఆశీర్వదించాలంటే, వారు నీతిగా జీవిస్తూ తమ దైనందిన జీవితాలలో న్యాయమును జరిగించులాగున వారిని "యెహోవా మార్గము"లో ఉపదేశించవలసిన అవసరత ఆయనకు ఉంది. వాగ్దాన దేశమును స్వతంత్రించుకొనుటకు మరియు దానిలోని ఆశీర్వాదములు మరియు వాగ్దానములకు వారసులగుటకు ఇవి వారికి కొన్ని నిబంధనలు అయ్యాయి (ద్వితీ. 28:1, 2, 15, 16, 36, 37; 1 సమూ. 15:22, 23; ఆమోసు 5:21–24; మీకా 6:6–8).

తన ప్రజలు నీతిగా జీవిస్తూ న్యాయమును జరిగించాలని దేవుడు కోరుకొనుటకు ఒక కారణం స్వాభావికంగా దేవుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు మరియు న్యాయవంతుడు గనుక. యెహోవా పోలికెలో సృష్టించబడినవారు అన్యాయంగా మరియు దుష్టులుగా ఉంటే, అట్టి జీవన విధానం ఆయన స్వభావముపైనే ప్రతిబింబిస్తుంది (లేవీ. 19:2, 13–18, 29–37; యెష. 1:16–23; హోషేయా 4:1–4). ఇశ్రాయేలీయులు విగ్రహారాధన వైపుమళ్లినప్పుడు—అంటే

ప్రతివిధమైన దుష్టత్వమును జరిగించుచు అనగా ఆచారపరమైన అభిచారములను ఆడ మరియు మగ వ్యభిచారులతో జరిగించుచు వారి చిన్నబిడ్డలను నరబలులుగా అర్పించినప్పుడు—అన్యజనులలో దేవుని యొక్క నామము దూషించబడింది (లేవీ. 18:1–30; 2 రాజులు 23:1–27; 24:1–4; యెష. 52:5; యెహెజ్కేలు 36:20; రోమా. 2:24).

నిజమైన పశ్చాత్తాపమునకు ప్రజలను తెచ్చుటకు దేవుడు వాగ్దానము చేయబడిన ఆశీర్వాదములను మరియు వాగ్దానము చేయబడిన తీర్పును కూడా ప్రయోగించాడు. దైవికమైన విచారము వారి హృదయములలో మరియు జీవితాలలో మార్పునకు దారితీస్తుందని ఆయన ఆశించాడు. అయినప్పటికీ, ఆయన వారిని (ప్రవక్తల ద్వారా) పిలిచిన కొలదీ, ఆయన నుండి వారు అంత దూరంగా వెళ్లిపోయారు (హోషేయా 11:1–7). హృదయములో విషాదకరమైన కఠినత్వము వచ్చి పశ్చాత్తాపమునకు ఎటువంటి స్థలమును ఇవ్వలేదు. ఈ కారణము చేతనే యూదా మరియు ఇశ్రాయేలు ఆఖరుకు తమ దేవాలయమును, రాజులను, దేశమును మరియు స్వతంత్రమును కోల్పోయి అన్యుల దేశములోనికి బందీలుగా కొనిపోబడ్డారు.

*విశ్వాసజనాంగము దుష్టుల మీదకి వచ్చినట్లుగా నీతిమంతుల మీదికి నాశనము కలుగకుండా దేవునితో విజ్ఞాపన చేస్తారు* (18:23–33). సొదొమ మరియు గొమొఱ్ఱాలకు దగ్గరగా కొందరు నీతిమంతులు ఇంకను ఉన్నారని మరియు దేవుని ఉగ్రత వారిపై పడినప్పుడు దుష్టులతో కూడా కలిసి వీరు కూడా నశించే ప్రమాదమున్నదని అబ్రాహాము నమ్మాడు. కాబట్టి, దైవికమైన న్యాయమను ఆధారము చేసికొని ఈ పట్టణములను గూర్చి ఆయన విన్నపము చేసాడు, కాగా దుష్టులు అనుభవించే విధిని నీతిమంతులు అనుభవించుటకు దేవుడు వారిని అనుమతించడని ఆయన నమ్మాడు.

ఖచ్చితంగా, జలప్రళయమును గూర్చి మరియు ప్రళయమునకు మునుపున్న నివాసితులు పశ్చాత్తాపపడి రాబోయే ప్రళయము నుండి తప్పించుకొనులాగున ఓడలోనికి ప్రవేశించుటకుగాను "నీతిని ప్రకటించు" నోవహును ఏర్పాటు చేసిన విషయమును అబ్రాహాము విన్నాడు (2 పేతురు 2:5). ఈ సందర్భంలో, దుష్ట పట్టణములపై రాబోయే వినాశనమును గూర్చి ప్రకటించుటకు సరిపడు సమయము లేదని పితరుడు స్పష్టంగా గుర్తించాడు. ఆయన చేయగలిగినదల్లా యొర్దాను లోయలోని పట్టణముల పై యెహోవా ఆకస్మికంగా పంపు వినాశనము నుండి వారిని తప్పించుటకుగాను నీతిమంతుల పక్షముగా – లోతు, అతని కుటుంబము మరియు బహుశా ఇంకొంత మంది – విజ్ఞాపన చేయుట మాత్రమే.

కనానులోని అమోరీయుల యొక్క దోషము "ఇంకను సంపూర్ణము కాలేదు" గనుక (15:16) దేవుడు వారిని ఇంకను కాపాడుతున్నాడని అబ్రాహాము అర్థం

చేసుకొని ఉంటాడు. ఇంకా అన్యజనులలో "సర్వోన్నతుడైన" దేవునికి ప్రతినిధిగా ఉండిన షాలేము రాజైన మెల్కీసెదెకును (14:18) కూడా ఆయన జ్ఞాపకము చేసికొని ఉంటాడు. అన్యజనుడైన ఈ యాజకుడు ఈ ప్రదేశంలో ఉన్న ప్రజలపై రక్షణార్థమైన ప్రభావాన్నికలిగిన నీతిగల రాజు గనుక (హెబ్రీ. 7:2 చూడండి), సరిపడునంత మంది నీతిమంతులు అక్కడ ఉన్నచో దేవుడు సొదొమ గొమొఱ్ఱాలను కాపాడతాడని అబ్రాహాము తుదకు భావించాడు. నైతికమైన మంచితనము, అది కొంతమందిలోనే ఉన్నప్పటికీ, దుష్ట సమాజమును కాపాడుటలో ఒక క్రియాశీలకమైన బలముగా పనిచేస్తుంది. నీతిగల న్యాయాధిపతిగా దేవుడు చెడుతనము చేయువారిపై తన ఉగ్రతను క్రుమ్మరించే ముందు దీనిని పరిగణలోనికి తీసుకుంటాడు.

పాపులైన ప్రజల పక్షంగా పితరుడు చేసిన విజ్ఞాపన వారిలో కూడా దేవుని రూపమునే కలిగియున్న తోటి మానవుల పట్ల ఆయనకున్న శ్రద్ధ మరియు దయను సూచిస్తుంది. ఒకరిపై మరొకరిని హెచ్చించుకొనేటట్లు చేసే అహంకారమును మరియు వారి పాపములను బట్టి మరియు అతిక్రమములను బట్టి ఇతరులు పొందే న్యాయమైన శిక్ష వలన కొందరికి కలిగే ఆనందమును అది తుడిచివేస్తుంది. తరువాత పౌలు చెప్పినట్లుగా, నిజమైన ప్రేమ "దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును" (1 కొరింథీ. 13:6). ఇది మన పాపములను దీనత్వంతో మనమే తెలుసుకొనుటను మరియు మనము పొందవలసిన శిక్షను దేవుడు మనకు ఇవ్వకుండా ఉన్నాడనే దానిపై కృతజ్ఞులముగా ఉండుటకు మనలను చేస్తుంది! పాపులముగా మనము సంపాదించినదల్లా మరణమే (రోమా. 6:23). కాబట్టి, చెడుతనము జరిగించువారిపై దైవిక ఉగ్రతయందు మనం నిలువబడినప్పుడు, సత్యముగా మనము చెప్పవలసినదల్లా "అక్కడ దేవుని కృపతో తప్ప నేను వెళ్లలేను" అని. సొదొమ మరియు గొమొఱ్ఱా పట్టణములను గూర్చి విజ్ఞాపన చేయులాగున అబ్రాహామును ప్రేరేపించింది స్పష్టంగా ఈ విధమైన వైఖరియే.

దుష్టుల మధ్యలో నీతిమంతుల విధిని గూర్చి అబ్రాహామునకున్న శ్రద్ధ పరిశుద్ధ గ్రంథమంతటిలో గొప్ప వ్యక్తులు చేసిన విజ్ఞాపనకు ఒక మాదిరిని ఉంచింది. పాత నిబంధనలో మూల ఉదాహరణయైన మోషే అనేకమారులు ఇశ్రాయేలు పక్షంగా విజ్ఞాపన చేసాడు. ఈ క్రమమును యెహోషువ కొనసాగించాడు, అలాగే సమూయేలు, దావీదు, సొలొమోను, మరియు ప్రవక్తలైన ఏలీయా, ఎలీషా, యెషయా, యిర్మీయా, మరియు యెహెజ్కేలులు కూడా.

క్రొత్తనిబంధనలో, కొండ మీద ప్రసంగములో యేసు హింసించువారిని గూర్చి విజ్ఞాపన ప్రార్థన చేయవలసినదిగా ఆజ్ఞాపించాడు (మత్తయి 5:44). బాధచెందిన మరియు నిరుత్సాహపూరితమైన ప్రజలను గూర్చి ఆయన ఆలోచిస్తుండగా, "కోతకు పనివారిని పంపు"మని "కోత యజమానుని" ప్రార్థించవలసినదిగా

శిష్యులకు చెప్పాడు (మత్తయి 9:36–38). సిలువ యొక్క నీడలో పేతురు యొక్క నమ్మిక "తప్పిపోకుండునట్లు" అయన ప్రార్థించాడు (లూకా 22:31, 32). విజ్ఞాపనపూర్వకమైన ఆయన గొప్ప ప్రధాన యాజకుని ప్రార్థన దేవుడు ఆయన శిష్యులందరిని దుష్టుని నుండి కాపాడి, సత్యముతో వారిని పవిత్రపరిచి, ఐక్యతతో వారిని అలాగే వారి సాక్ష్యము ద్వారా ఆయనయందు విశ్వాసముంచు వారినందరినీ ఆశీర్వదించాలని చేసాడు (యోహాను 17:9–24).

యేసు తన ప్రజల కొరకు "విజ్ఞాపనము చేయుటకు నిరంతరము జీవించుచున్నాడు" (హెబ్రీ. 7:25) అని ఎరిగి అపొస్తలులు మరియు ఆదిమ సంఘమువారు వారి ప్రార్థనలలో యేసు యొక్క మాదిరిని అనుసరించారు (అపొ. 1:14; 2:42; 4:23–31; 12:5–12; 13:1–3). క్రైస్తవ ప్రార్థనలలో పరిశుద్ధాత్మ యొక్క సహాయాన్ని పౌలు కూడా ప్రస్తావించాడు (రోమా. 8:26–28). మధ్యధరా సముద్రపు ప్రాంతములో ఉన్న దేవుని ప్రజలను గూర్చి ఆయన చేసిన హృదయములను తాకు మరియు శక్తిగల ప్రార్థనలతో ఆయన పత్రికలు నిండిపోయాయి. అపొస్తలులు కొన్నిసార్లు తాము వ్యక్తిగతంగా ఎరుగని సహోదరులను గూర్చి కూడా ప్రార్థించారు (ఎఫెసీ. 1:15–23; 3:2, 14–21). ఇంకా, క్రైస్తవులు "ఆత్మవలన ప్రతి సమయము నందును ప్రతివిధమైన ప్రార్థనను" చేయుచు, "పరిశుద్ధుల నిమిత్తము పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనముచేయుచు" ఉండమని చెప్తూ, ఆయన "సువార్త మర్మమును ధైర్యముగా తెలియజేయుటకు" గాను వారి విజ్ఞాపన ప్రార్థనలను కోరాడు (ఎఫెసీ. 6:18, 19). పౌలు విజ్ఞాపన ప్రార్థనలలో ఎంతటి విలువను చూసాడంటే, "మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మది గాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరికొరకును రాజుల కొరకును అధికారులందరి కొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును" చేయవలెనని క్రైస్తవులకు హెచ్చరించాడు (1 తిమోతి 2:2).

---

## సూచనలు

[1]John H. Walton, Victor H. Matthews, and Mark W. Chavalas, *The IVP Bible Background Commentary: Old Testament* (Downers Grove, Ill.: InterVarsity Press, 2000), 50. [2]Edwin Yamauchi, "חָוָה," in *TWOT*, 1:268. [3]సమరియ స్త్రీ కూడా "జీవజలము"ను యేసు ఆమెకు వాగ్దానము చేసినప్పుడు (యోహాను 4:10, 11) ఆయనను "ప్రభువు" అని సంబోధించింది, అంటే అర్థము "అయ్యా" (NASB; KJV; NIV; NRSV). [4]ప్రాచీన హెబ్రీ కొలతలకు ఆధునిక సమాంతర కొలతలను నిర్ణయించడం కష్టం. "seah"అనే దానిపై చర్చ కొరకు చూడండి, Roland de Vaux, *Ancient Israel*, vol. 1, *Social Institutions* (New York: McGraw-Hill Book Co., 1965), 201–3; and Edward M. Cook, "Weights and Measures," in *The*

*International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1988), 4:1050–51. [5]John E. Hartley, *Genesis*, New International Biblical Commentary (Peabody, Mass.: Hendrickson Publishers, 2000), 178. [6]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 312. [7]Martin J. Mulder, "Sodom and Gomorrah," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 6:99–103. [8]See *The Confession of Faith of the Presbyterian Church in the United States* (Richmond, Va.: John Knox Press, 1952), 25–30. *Westminster Confession of Faith* నుండి సంగ్రహించబడిన ఈ బోధ ప్రపంచమంతటిలో అనేక "పునరుద్ధరించబడిన సంఘముల"లో ("Reformed Churches") చాల మందిచే అనుసరించబడుతుంది. [9]John N. Oswalt అన్నాడు, "ఒక ప్రత్యేకమైన పని కొరకు దేవుడు కొంతమందిని ఎన్నుకుంటాడు గనుక, ఆ ఉద్దేశముల నుండి వైదొలగితే వారిని ఆయన తిరస్కరించగలడు కూడా (1 సమూ. 2:27 మొ.)" (John N. Oswalt, "בָּחַר," in *TWOT*, 1:100). [10]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 18–50*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1995), 23.

[11]John T. Willis, *Genesis, The Living Word Commentary* (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 261–62.